

క్యాబేజీపై తెగుళ్ల దాడి

జిల్లాలో క్యాబేజీ పంటపై తెగుళ్లు దాడి చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎరువులను ఎక్కువగా వాడడం వల్ల తెగుళ్లు మరింత పెరుగుతున్నాయి.




చైన్ స్నాచర్ల హల్‌చల్

కొవ్వూరు పట్టణంలో పట్టపగలే చైన్‌స్నాచర్లు హల్‌చల్ చేశారు. ఇద్దరు మహిళల మెడలో నుంచి పది కాసుల బంగారు ఆభరణాలను లాక్కుని పరారయ్యారు.

8లో

డెల్టా కాలువలకు 9,745 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.20 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

అన్నవరప్పాడు వెంకన్న హుండీ ఆదాయం రూ.4.03 లక్షలు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి హుండీని బుధవారం అధికారులు, గ్రామ పెద్దల సహకారంతో తెరిచామని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ప్రధాన హుండీతో పాటు ఉప ఆలయాల హుండీలా ద్వారా రూ.3,92,383 వచ్చిందని, అన్నదాన హుండీ ద్వారా రూ.11,604మొత్తం ఆదాయం రూ.4,03,987లు వచ్చిందని ఈ ఆదాయం 48 రోజులకు అని తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఎంవీ రామయ్య, గ్రామ పెద్దలు పంతం చిన్న, పప్పొప్పు నాగేశ్వరరావు, పంతం నాగేశ్వరరావు, రంగనీటి కట్లయ్య, ఓసూరి బాల నాగేశ్వరరావు, బొలిశెట్టి ప్రసాద్ సమక్షంలో హుండీ లెక్కింపు సాగింది.

అబద్ధపు వాగ్దానాలతో కూటమికి అధికారం

పెరవలి: కూటమి ప్రభుత్వం అబద్ధపు వాగ్దానాలతో అధికారం చేపట్టిందని, అందుకు నిదర్శనం వారు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు నేటికీ అమలు చేయకపోవటమేనని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి జి.సుందర్ విమర్శించారు. పెరవలిలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పారు అదీ లేదు, అమ్మ ఒడి లేదు, సంక్షేమ పథకాలు లేవు, కేవలం పింఛన్ పెంచి చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. ఇప్పుడు ఆ పింఛన్ దారులను మోసగించటానికి ఏరివేత కార్యక్రమం చేపట్టారని, ఇది చాలా అన్యాయమన్నారు.

డ్రోన్లతో కషాయాల పిచికారీ

పెరవలి: జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో వరిపంటపై ఆశించే తెగుళ్లను అరికట్టడానికి డ్రోన్ సహాయంతో కషాయాలను పిచికారీ చేయిస్తున్నామని సేంద్రియ వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సాకా రామకృష్ణ తెలిపారు. పెరవలి మండలం ముక్కామలలో బుధవారం వరిచేలపై కషాయాలను డ్రోన్‌తో పిచికారీని అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలంలో 250 ఎకరాల్లో 6 డ్రోన్‌లతో ప్రకృతి వ్యవసాయం చేసే చేలకు కషాయాలను పిచికారీ చేస్తున్నామని తెలిపారు. దీని వలన రైతులకు ఖర్చు తగ్గడంతో పాటు ప్రతి వరిదుబ్బుపై మందు పిచికారీ జరిగి మంచి దిగుబడి వస్తుందన్నారు.

బంగారుకొండ ప్లస్ కమిటీ ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ: వయసుకు తగ్గ బరువు, ఎదుగుదల లేని పిల్లలకు బంగారు కొండ ప్లస్ కిట్లు పంపిణీ చేసి, ఆరోగ్యం మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీఓలు, సూపర్ వైజర్లతో కలెక్టర్ బంగారు కొండ ప్లస్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో బంగారు కొండ ప్లస్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. బంగారు కొండ ప్లస్ జిల్లా కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా జాయింట్ కలెక్టర్ వైస్ ప్రెసిడెంట్ గా వ్యవహరిస్తారని, కమిటీ మెంబర్లుగా డీఆర్డీఏ పీడీ, సివిల్ సప్లైస్ డీఎం,సీపీఓ, జిల్లా పంచాయతీ అధికారిని నియమించామన్నారు. కన్వీనర్‌గా మహిళా,సంక్షేమ శాఖ అధికారి వ్యవహరిస్తారన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేజ్ ఏర్పాటు బారికేడింగ్, వేడుకలు తిలకించేందుకు వచ్చే విద్యార్థులకు గ్యాలరీల ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకు వేడుకలు నిర్వహించే క్రమంలో ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల సమాహారంగా శాఖల శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మురళీకృష్ణ, ఇతర జిల్లా అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో జేఈఈ మెయిన్స్ పరీక్షల నిర్వహణను అత్యంత పకడ్బందీగా నిర్వహించామని కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం తెలిపారు. రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌లో జరిగిన పరీక్షల్లో మొదటి షిఫ్ట్‌లో 890 మంది విద్యార్థులకు గాను 883 మంది హాజరయ్యారన్నారు. షిఫ్ట్ 2కి 884కు గాను 878 హాజరు అయినట్లు తెలిపారు. గురువారం రెండు షిఫ్ట్‌లలో పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు.

ఆశల వర్జీనియా!

- ప్రారంభమైన వర్జీనియా పొగాకు క్యూరింగ్‌లు
- ఆశాజనకంగా పొగాకు రంగులు
- దిగుబడులపై పెరుగుతున్న నమ్మకం
- 28,719 హెక్టార్లలో పంట సాగు
- 12,487 మంది రైతులు
- ఎగుమతి ఆధారిత పంట
- 58.94 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి



దేవరపల్లి మండలం సంగాయిగూడెంలో క్యూరింగ్ చేసిన వర్జీనియా పొగాకు

దేవరపల్లి: మన జిల్లాతో పాటు ఏలూరు జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ప్రధాన ఎగుమతి ఆధారిత పంటగా ఉన్న వర్జీనియా పొగాకు రెలుపులు మొదలయ్యాయి. రెలుపులు జరుగుతుండడంతో తోటల్లో రెలిసిన పొగాకు క్యూరింగ్‌లు ప్రారంభమయ్యాయి. 2024–25 పంట కాలానికి గత ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు రైతులు రెండు జిల్లాల్లోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో వర్జీనియా పొగాకు తోటలు వేశారు. అనేక ఒడిదొడుకులు ఎదుర్కొని రైతులు తోటలను పెంచారు. తోటలు వేసే సమయంలో విస్తారంగా వర్షాలు కురవడంతో నాట్లు ఆలస్యంగా వేశారు. అనంతరం వాతావరణం అనుకూలించకపోవడంతో తోటలకు వివిధ రకాల తెగుళ్లు సోకాయి. దీంతో రైతులు ఆందోళన చెందినప్పటికీ వాతావరణంలో వచ్చిన మార్పులతో తెగుళ్ల నుంచి తోటలు తేరుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. నాట్లు ఆలస్యం అయినప్పటికీ తోటలు ఆశాజనకంగా పెరగడంతో దిగుబడులు బాగుంటాయని రైతులు అనుకుంటున్నారు. తోటలు పక్వానికి రావడంతో గత రెండు వారాలుగా ముదరగా వేసిన తోటల్లో రెలుపులు మొదలయ్యాయి. అప్పర్ ఎస్ఎల్ఎస్ ప్రాంతంగా పిలిచే జంగారెడ్డిగూడెం ప్రాంతంలో పొగాకు రెలుపులు, క్యూరింగ్‌లు ఎక్కువగా జరుగుతుండగా, మిగిలిన ప్రాంతాల్లో రెండు, మూడు క్యూరింగ్‌లు జరిగినట్టు అధికారులు తెలిపారు. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం(మొత్తం ఐదు) కేంద్రాల పరిధిలోని ఉత్తర తేలిక నేలల్లో(ఎన్ఎల్ఎస్) రైతులు దాదాపు 50 ఏళ్లుగా వర్జీనియా పొగాకు పంట సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించిన పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది.

రంగు, నాణ్యత ఆశాజనకం

పొగాకు రంగు, నాణ్యత ఆశాజనకంగా ఉండడంతో దిగుబడులు, మార్కెట్లో ధరపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. సాధారణంగా ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి సాధించే రైతులు ఉన్నారు. సగటున ఎకరాకు 10 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. బ్యారన్‌కు 44 క్వింటాళ్ల ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే తోటలు ఆశాజనకంగా ఉండడంతో దిగుబడులు పెరుగుతాయని అధికారులు అంటున్నారు.

28,719 హెక్టార్లలో సాగు

రెండు జిల్లాల్లో గల ఐదు వేలం కేంద్రాల పరిధిలో 2024–25 పంట కాలానికి 12,487 మంది రైతులు 28,719 హెక్టార్లలో పంట వేశారు. ఇది గత ఏడాది కంటే 4 వేల హెక్టార్లు అధికం. 23,575 హెక్టార్లలో పంట సాగుకు రైతులు బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనికి మించి అదనంగా దాదాపు 5 వేల హెక్టార్లలో పంట వేసినట్టు బోర్డు అధికారులు తెలిపారు. ఇదికాకుండా మరొక 5 వేల హెక్టార్లలో అనధికారికంగా పంట వేసినట్టు సమాచారం. ఈ ఏడాది పొగాకు ఉత్పత్తి దాదాపు 80 మిలియన్ల కిలోలు ఉంటుందని అధికారులు, ట్రేడర్ల అంచనా వేస్తున్నారు. 58.94 మిలియన్ల కిలోల ఉత్పత్తికి మాత్రమే బోర్డు అనుమతి ఇచ్చింది. గత ఏడాది 48.48 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా, 67.26 మిలియన్ల కిలోలు ఉత్పత్తి జరిగింది.

ఎగుమతి ఆధారిత పంట

ఈ ప్రాంతంలో పండించిన పొగాకు ఎగుమతి ఆధారిత పంట. ఇక్కడ పండించిన పొగాకు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి జరుగుతుంది. అంతర్జాతీయ మార్కెట్‌కు అవసరమైన పొగాకు ఎస్ఎల్ఎస్ ప్రాంతంలో రైతులు పండిస్తున్నారు. జింబాబ్వే, బ్రెజిల్, ఇండోనేషియా దేశాల్లో పండిస్తున్న వర్జీనియా పొగాకుకు దీటుగా ఇక్కడ రైతులు నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేసి గుర్తింపు పొందుతున్నారు. దీంతో పంట సాగులో రైతులు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పురుగు మందుల అవశేషాలు ఉండరాదు



పొగాకులో రసాయన పురుగు మందుల అవశేషాలు ఉండరాదు. అవశేషాలపై యూరోపియన్ యూనియన్ ఆంక్షలు పెరిగాయి. అవశేషాలు ఉన్న పొగాకు కొనుగోలుకు ట్రేడర్లు ముందుకు రాని పరిస్థితి, తప్పనిసరి పరిస్థితిలో పురుగు మందులు వాడవలసి వస్తే శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన మందులను వాడాలి. క్యూరింగ్ చేసిన పొగాకు రంగు, నాణ్యత బాగున్నాయి. మందు పిచికారీ చేసిన 15 రోజుల వరకు ఆకు రెలుపు చేయరాదు. మొక్క తల తుంచిన తర్వాత ఎటువంటి మందులు పిచికారీ చేయకూడదు. గ్రేడింగ్ సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకుని అన్య పదార్థాలు లేకుండా చూడాలి. ఈ ఏడాది 28,719 హెక్టార్లలో పంట వేశారు. నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేసి గిట్టుబాటు ధర పొందాలి.

– జీఎల్‌కే ప్రసాద్, రీజినల్ మేనేజర్, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం



దేవరపల్లి మండలం బుచ్చియపాలెంలో క్యూరింగ్ చేసిన పొగాకును పరిశీలిస్తున్న బోర్డు అధికారులు, కొనుగోలు సంస్థల ప్రతినిధులు



దేవరపల్లి మండలం బందపురంలో సాగులో ఉన్న వర్జీనియా పొగాకు తోట

ఫ్లాష్... ఫ్లాష్

అర్ధరాత్రి వేళ ఆక్రందన

- ట్రావెల్ బస్సు బోల్తా: ఒకరి మృతి
- 25 మందికి తీవ్ర గాయాలు
- ఐదు అంబులెన్స్‌ల్లో ఆసుపత్రికి తరలింపు



క్షతగాత్రులను రక్షిస్తున్న దృశ్యం
బోల్తా పడిన బస్సు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సాఫీగా సాగిపోతున్న ప్రయాణంలో అనుకోని ప్రమాదం విషాదాన్ని నింపింది.. అర్ధరాత్రి వేళ ఆక్రందనలు మిగిల్చింది.. ట్రావెల్ బస్సు బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, 25 మందికి పైగా తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం అర్ధరాత్రి 12.30 ప్రాంతంలో చోటుచేసుకుంది. మృతులు ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసు వర్గాల ద్వారా తెలియవచ్చింది.. ఆ వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు కావేరి ట్రావెల్ బస్సు సుమారు 50 మంది ప్రయాణికులతో బయలు దేరింది. ఈ బస్సు రాజమహేంద్రవరం రూరల్ కాతేరు– కొంతమూరు మధ్యలో అగ్రహారం వద్దకు వచ్చేసరికి బోల్తా పడింది. ఇక్కడ రోడ్డు వేస్తున్నారు. డైవర్షన్ ఇచ్చిన విషయాన్ని ఆ డ్రైవర్ దగ్గరకు వచ్చేవరకూ గమనించకపోవడం, ఒక్కసారిగా వేగంగా రైట్‌కు బస్సును తిప్పడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ యువతి(20) అక్కడికక్కడే మృతి చెందగా, 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఐదు అంబులెన్స్‌లలో ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఫోర్త్ బ్రిడ్జిపై ట్రాఫిక్ స్తంభించింది. ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలానికి పోలీసు శాఖ ఉన్నతాధికారులు వచ్చి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే పనుల్లో నిమగ్నమయ్యారు.

విశ్లేషణతో రోడ్డు ప్రమాదాల నివారణ

కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రమాదాలు జరిగిన ప్రదేశాల్లో, అక్కడ తీసుకున్న పరిష్కార మార్గాలపై విశ్లేషణ చేయాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవం –2025 సందర్భంగా జిల్లా రహదారుల భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో గోల్డెన్ అవర్ లో తీసుకున్న చర్యలను సమీక్షించి, వాటిపై అధ్యయనం చేయాలని స్పష్టం చేశారు. ఈ అధ్యయనాన్ని ఆర్ట్స్ కళాశాల అధ్వర్యంలో కేసుల వారీగా చేయాలని పేర్కొన్నారు. జాతీయ రహదారులు, ట్రాఫిక్ వారీగా, డీఎం హెచ్‌వోలు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం ముఖ్యం అన్నారు. రద్దీ సమయాల్లో ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ మళ్లింపుపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. పోలీసు, జిల్లా యంత్రాంగం సూచించిన 27 బ్లాక్ స్పాట్స్‌లో, 16 ప్రమాద కరమైన రహదారులు, 11 జంక్షన్ ప్రాంతాల్లో లైటింగ్, రబ్బర్ స్ట్రిప్స్‌ను జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి పరిహారం అందజేయాల్సి ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా ఐఆర్‌ఏడీ (ఐరాడ్ – ఇంటిగ్రేటెడ్ రోడ్డు ప్రమాద డేటా) డేటా ఎంట్రీ నమోదు చేయడంలో సమన్వయ శాఖల అధికారులు కచ్చితంగా విధులను నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్ షా
రాజీనామా చేయాలి



ర్యాలీలో పాల్గొన్న గిడుగు రుద్రరాజు, విశ్వేశ్వరరెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని అఖిల భారత కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారత కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన కంబాలచెరువు వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం నుంచి గోకవరం బస్టాండ్ దగ్గర ఉన్న బాబాసాహెబ్ డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వరకు అమిత్ షా కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గిడుగు రుద్రరాజు, ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ పాలక్‌వర్మ మాట్లాడుతూ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగాన్ని తొలగించాలనడం దారుణమన్నారు. మతాల పేరుతో ప్రాంతాల వారీగా దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకున్న ఆర్ఎస్ఎస్ భావజాలంతో కూడిన రాజ్యాంగాన్ని నిర్మించాలని బీజేపీ విశ్వప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సంపద అంతా కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడమే లక్ష్యంగా బీజేపీ పాలన చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ దేశం విచ్ఛిన్నం కాకుండా, దేశ సంపదను దోచిపెట్టడానికి వీలు లేకుండా అన్ని విధాలుగా రక్షణగా ఉంటుందన్నారు. అనంతరం కృష్ణసాయి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి పార్టీ విస్తృత సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకుని వచ్చేందుకు ప్రత ఈఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, బోడా వెంకట్, ట్రైనింగ్ ఇంచార్జ్ జంగా గౌతమ్, జిల్లా ఇన్‌చార్జి కొలనుకొండ శివాజీ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగులపై పనిభారం తగ్గించాలి

ఐసీఈయూ రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి కోదండరామ్



ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: ఎల్ఐసీలో దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న క్లాస్–3, క్లాస్–4 ఉద్యోగాలు నియామకాలు వెంటనే చేపట్టాలని, 2020లో ఎల్ఐసీ ఇచ్చిన నియామక ప్రకటనలో భర్తీకాని 2,700 అసిస్టెంట్‌ల నియామకం వెంటనే చేపట్టి ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ) రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఎల్ఐసీ రాజమండ్రి డివిజనల్ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ 85 శాతం పైన సభ్యత్వం ఉన్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కి గుర్తింపు ఇవ్వాలని కోరారు. రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు ఎస్ఆర్ జె.మాథ్యూస్ మాట్లాడుతూ ఎంతో మంది సంస్థలో క్లాస్ 4 ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, వెంటనే నియామకాలు చేపట్టడం ద్వారా వారిని కూడా శాశ్వత ఉద్యోగులుగా నియమించవచ్చని తెలిపారు. డివిజన్ ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి పీఎస్ఎన్ రాజు, మహిళా ఉద్యోగుల కన్వీనర్ ఆర్.శిరీష ,శ్రీలత, రామలక్ష్మి, రమణ, జి.ఎస్.ఎల్. లక్ష్మి, డివిజనల్ యూనిట్ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కుబడి వ్యాపారం



కడియం ప్రాంత నర్సరీల్లోని సీజనల్స్

నర్సరీ రైతులకు నష్టాన్ని మిగిల్చిన సీజనల్స్

కడియం: సంక్రాంతి పండగ వెళ్లిపోయింది కానీ.. కడియం ప్రాంత నర్సరీల్లో సీజనల్స్ మాత్రం వెళ్ల లేదు. ఏటా నూతన సంవత్సర వేడుకలు, పండగ తదితర ముఖ్య రోజులను పురస్కరించుకుని నర్సరీ రైతులు పెద్ద ఎత్తున సీజనల్స్ తీసుకువస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి సేకరించి తెచ్చి, ఇక్కడ అభివృద్ధి చేసి అమ్మకాలు సాగిస్తారు. అయితే ఈ ఏడాది సీజనల్స్ వ్యాపారం దెబ్బతీసిందని పలువురు నర్సరీ రైతులు వాపోతున్నారు. ఏటా డిసెంబర్ ఆఖరి వారం మొదలు జనవరి నెల మొత్తం సీజనల్స్ కొనుగోలు చేసేందుకు వచ్చే సందర్శకులతో నర్సరీల వద్ద సందడి నెలకొంటుంది. అయితే అందుకు భిన్నంగా ఈ ఏడాది అంతంత మాత్రంగానే వ్యాపారం సాగిందని వివరిస్తున్నారు. తెచ్చిన స్టాక్‌లో సగం కూడా అమ్ముడు కాకపోవడంతో ఈ ఏడాది సీజనల్స్ వ్యాపారం నష్టం మిగిల్చిందంటున్నారు.

నామమాత్రంగా అమ్మకాలు

బంతి, చామంతి, ఐటమ్ రోజెస్, నాటు గులాబీ మొక్కలతో పాటు, అలంకరణకు వాడే మొక్కలు కూడా సీజనల్స్ జాబితాలో ఉంటాయి. అయితే ఈ ఏడాది వీటన్నిటి అమ్మకాల్లోను వెనుకబడ్డామని రైతులు వివరిస్తున్నారు. ముఖ్యంగా మంచు కురిసే సమయంలోనే ఆకట్టుకునే విధంగా ఉండే చామంతి, బంతి మొక్కల అమ్మకాలు కూడా నామమాత్రంగానే ఉండడం రైతులను ఆందోళన పరుస్తోంది. ప్రస్తుత సీజన్‌లో వీటిని అమ్మకపోతే, ఆ తరువాత వచ్చే వేసవిలో ఈ మొక్కలు కళను కోల్పోతుంటాయి. ఒకటి రెండు నెలలు అత్యంత ఆకర్షణీయంగా కన్పించే ఈ మొక్కలు తిరిగి వచ్చే ఏడాది మంచు సీజన్‌లోనే ఆ కళను పొందుతాయి. వీటిని ఇప్పుడు అమ్మకపోతే, వచ్చే సీజన్ వరకు కాపాడుకోవడం రైతుల తలకు మించిన భారంగా మారుతుంది. ఏటా ఈ సీజన్‌లో లక్షలాది మొక్కల అమ్మకాలు సాగేవి. ఈ ఏడాది అందుకు విరుద్ధంగా వ్యాపారం ఉందంటున్నారు. సీజన్ వ్యాపారాన్ని దృష్టిలో పెట్టుకుని లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి వీటిని ఇక్కడికి తెచ్చారు. అయితే అమ్మకాలు ఆశించినంతగా లేకపోవడంతో పెట్టుబడులు కూడా వస్తాయో? రావోనన్న ఆందోళన నెలకొంది. నర్సరీల్లో ప్రధాన ఆకర్షణగా ఉండే సీజనల్స్ అమ్మకాలు పడిపోవడానికి ప్రధాన కారణంగా కొనుగోలుదారుల్లో ఆసక్తి తగ్గడమేనంటున్నారు. ఈ మొక్కలు సైజుని బట్టి ఒక్కొక్క మొక్క రూ.100 నుంచి రూ.150 వరకు ధర పలుకుతాయి. కొనేవారు లేకపోవడంతో ధర తగ్గించి మరీ అమ్ముకోవాల్సి వస్తోంది. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టి వీటిని తీసుకువచ్చారు. అయితే సగం సరకు కూడా అమ్మకం కాలేదంటున్నారు.

వ్యాపారం బాగోలేదు

ఏటా సీజనల్స్ వ్యాపారం బాగుండేది. అయితే ఈ ఏడాది సగం వ్యాపారం కూడా అవ్వలేదు. రూ.5 లక్షలు వెచ్చించి, చామంతి, గులాబీ, బంతి తదితర అలంకరణ మొక్కలు తీసుకువచ్చాం. వీటి నిర్వహణ, కూలిఖర్చులు, పొలాల శిస్తులను లెక్కేస్తే రూ.7 లక్షల నుంచి 8 లక్షల వరకు పెట్టుబడులు అవుతుంది. కానీ రూ.మూడు లక్షల విలువైన మొక్కలు కూడా అమ్మకం కాలేదు. ఎండలు పెరిగితే వీటిని కాపాడుకోవడం కష్టమవుతుంది. నష్టం తప్పేలా లేదు.

– వేంకటేశ్వరరావు, సీజనల్స్ వ్యాపారి, వేమగిరి.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,500 – 16,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

వలలో చిక్కుకుని మత్స్యకారుడి మృతి

మామిడికుదురు: పీతల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ వలలో చిక్కుకుని గోగన్నమఠం గ్రామంలోని పల్లిపాలేనికి చెందిన మత్స్యకారుడు పెసింగి బ్రహ్మయ్య (49) మృతి చెందాడు. అతడి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేశామని ఏఎస్సై పి.కృష్ణ బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి చెరువులో పీతల వేటకు వెళ్లిన బ్రహ్మయ్య బుధవారం వలలో చిక్కుకుని మృతి చెంది ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో అపస్మారక స్థితిలో ఉన్న అఖిల్

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం – రామచంద్రపురం మధ్యలో ఏటిగట్టుపై రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో 24 ఏళ్ల చీకట్ల అఖిల్ తలకు తీవ్ర గాయమై అపస్మారకస్థితికి వెళ్లాడు. అతడి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. సింగవరం అంబేడ్కర్ నగర్‌కు చెందిన అఖిల్ బుధవారం తన స్నేహితుడి స్కూటీపై పురుషోత్తపట్నం వైపు నుంచి వస్తున్నాడు. అతడిని ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ఘటనలో రెండు వాహనాలపై ఉన్న ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. అఖిల్ రోడ్డుపై పడిన తక్షణమే తలకు బలమైన దెబ్బ తగలడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అతడిని సీతానగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైకులు నడిపిన 11 మందికి రెండు రోజులు చొప్పున జైలు, మరో 18 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ – 1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో వీరు పట్టుబడ్డారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపర్చగా పైవిధంగా న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

క్యాబేజీపై తెగుళ్ల దాడి



కానూరు అగ్రహారంలో సాగవుతున్న క్యాబేజీ తోట

- నిలిచిపోతున్న మొక్క ఎదుగుదల
- రైతుల ఆవేదన

పెరవలి: నిత్యావసరాలు, కూరగాయల ధరలు ప్రస్తుతం భాగా పెరిగిపోయాయి. వాటిని కొనుగోలు చేయడానికి సామాన్యుడు తీవ్ర అవస్థలు పడుతున్నాడు. ముఖ్యంగా కూరగాయల ధరలను చూస్తే వణుకు పుడుతోంది. కారణాలేవైనా గానీ వాటిని కొనుగోలు చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదే సమయంలో పుండు మీద కారం చల్లినట్టుగా క్యాబేజీ పంటను తెగుళ్ల ఆశించాయి.

2,795 హెక్టార్లలో సాగు



సీహెచ్ శ్రీనివాస్, ఉద్యాన వన అధికారి కొవ్వూరు

జిల్లాలోని 2,795 హెక్టార్లలో కూరగాయల సాగు జరుగుతుండగా, వాటిలో క్యాబేజీని 300 ఎకరాల్లో పండిస్తున్నారు. పెరవలి, నిడదవోలు, కొవ్వూరు, నల్లజర్ల, కడియం, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో ఈ పంట అధికంగా సాగవుతోంది. ప్రస్తుతం క్యాబేజీని తెగుళ్ల ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల ఇవి మరింత ఉధృతి చెందుతున్నాయి. క్యాబేజీని రెక్కల పురుగు, పేనుబంక, నారుకుళ్లు, నల్లకుళ్లు తెగుళ్ల ఆశించాయి. వీటి నివారణకు తీసుకునే చర్యలను కొవ్వూరు ఉద్యాన వన అధికారి సీహెచ్ శ్రీనివాస్ వివరించారు.



రెక్కల పురుగు ఆశించిన క్యాబేజీ మొగ్గ



నారుకుళ్లు తెగులు సోకి ఎండిపోయిన ఆకులు



పేనుబంక పురుగు సోకడంతో పాడైపోయిన క్యాబేజీ మొక్క

రెక్కల పురుగు

ఈ పురుగు ఆకుల అడుగు భాగాన ఉండి ఆకులను తిని నాశనం చేస్తుంది. దీంతో సూర్యరశ్మిని స్వీకరించలేని ఆకులు పత్ర హరితం కోల్పోయి ఎండిపోతాయి. ఈ పురుగులు చిన్నవిగా, ఆకుపచ్చ, గోధుమ రంగులో ఉంటాయి. తెలుపు రంగు సన్నని రెక్కలు, పొడవాటి వెంట్రుకలు, వెనుక రెక్కలు ఉంటాయి. పైరుపై వీటి ప్రభావం ఉధృతంగా ఉన్నప్పుడు ఆకులన్నీ రంధ్రాలతో ఉండి క్యాబేజీ పరిమాణం కూడా చిన్నదిగా ఉంటుంది. దీంతో మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక రైతులు నష్టాల పాలవుతారు.

నివారణ చర్యలు

క్యాబేజీ పంట వేసిన తర్వాత ప్రతి 25 వరసలకు రెండు వరసల చొప్పున ఆవ మొక్కలను ఎరపంటగా వేయాలి. రెక్కల పురుగు గుడ్లను నాశనం చేసేందుకు వేపగింజల ద్రావణాన్ని పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు లీటరు నీటికి స్పైనోసాడ్ 0.3 మిల్లీమీటర్లు కలిపి పిచికారీ చేయాలి. నారు నాటిన 30, 45 రోజుల్లో బీటీ మందులు ఒక గ్రామును ఒక లీటరు నీటిలో కలిపి చల్లాలి.

పాడి-పంట

పేనుబంక

పేనుబంక పురుగులు ఆకుల అడుగు భాగాన గుంపులుగా చేరి ఆకుల్లో రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగజేస్తాయి. రసం పీల్చడం వలన ఆకులు ఎండిపోయి రాలిపోతాయి. ఈ పురుగులు కనిపించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. డైమిథోయేట్ లేదా మిథైల్‌డెమటాన్ 2 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నల్లకుళ్లు

ఈ తెగులు పంటపై ఎప్పుడైనా ఆశించవచ్చు. తెగులు సోకిన ఆకులు పత్ర హరితాన్ని కోల్పోయి వి ఆకారంలో ఉన్న నల్లని మచ్చలు ఏర్పడతాయి. ఈ తెగులు ఆశించిన ఆకుల ఈనెలు కూడా నల్లగా మారతాయి. ఇది రాకుండా ఉండేందుకు స్ట్రెప్టోసైక్లిన్ ఒక గ్రామును పది లీటర్ల నీటిలో కలిపి అందులో విత్తనశుద్ధి చేయాలి. ఇదే మందును నారు నాటినప్పుడు, మొగ్గ తయారైనప్పుడు పిచికారీ చేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములను ఒక లీటరు నీటిలో కలిపి మొక్కల మొదలు చుట్టూ తడపాలి. ఎకరాకు ఐదు కిలోల బ్లీచింగ్ పౌడర్ చల్లి పంట మార్పిడి చేయాలి.

నివారణ

ఈ పంట వేసే రైతులు ఎకరానికి 8 నుంచి 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు భూసారాన్ని బట్టి 32 నుండి 40 కిలోల భాస్వరం, 40 కిలోల పొటాష్ ఎరువులను చివరి దుక్కిలో వేసి బాగా కలియదున్నాలి. 32 కిలోల నత్రజనిని మూడు దఫాలుగా నాటిన 25, 30 రోజుల మధ్య ఒకసారి, 50 నుంచి 60 రోజులకు రెండోసారి, 75 నుంచి 80 రోజులకు మూడోసారి వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీటి తడులను అందించాలి.

నారుకుళ్లు

ఈ తెగులు సోకిన మొక్కల కాండం మొదలులో మెత్తగా తయారై కుళ్లి ఒడిలిపోయి చనిపోతాయి. ఈ తెగులు సోకినట్లుగా గుర్తించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

నివారణ చర్యలు

ఈ తెగులు సోకకుండా నారుమడులను ఎత్తుగా ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలి. విత్తనాన్ని పలుచగా వరసల్లో వేయాలి. ఎక్కువ నీటి తడులు ఇవ్వకుండా చూడటంతో పాటు మురుగునీరు బయటకు వెళ్లేలా మార్గాలను ఏర్పాటు చేయాలి. నారు మొలిచిన తర్వాత కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములను లీటరు నీటిలో కలిపి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

కొవ్వూరులో చైన్ స్నాచర్ల హల్ చల్

- ఇద్దరు మహిళల మెడలో పది కాసుల బంగారం చోరీ
- పట్టపగలే ఘటన
- గాలింపు చేపట్టిన పోలీసులు

కొవ్వూరు: పట్టణంలో పట్టపగలే చైన్‌స్నాచర్లు హల్ చల్ చేశారు. ఇద్దరు మహిళల మెడలో పది కాసుల బంగారు ఆభరణాలను లాక్కుని పరారయ్యారు. నిత్యం రద్దీగా ఉండే జూనియర్ కళాశాల నుంచి గాయత్రి థియేటర్ సెంటర్‌కు వెళ్లే రోడ్డులో బుధవారం మధ్యాహ్నం 11 గంటల సమయంలో ఈ ఘటనలు జరగడం విశేషం. వివరాల్లోకి వెళితే.. కుమారదేవం గ్రామానికి చెందిన నక్కా ధనలక్ష్మి, వీర్ల సుబ్బలక్ష్మి బుధవారం కొవ్వూరులోని భారతీయ స్టేట్ బ్యాంకులో పని నిమిత్తం వచ్చారు. వారిద్దరూ పట్టణంలోని సెయింట్ లూథరన్ చర్చి సమీపంలో రోడ్డు పక్కనే నిలబడి మాట్లాడుకుంటుండగా మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు..ధనలక్ష్మి మెడలోని మూడున్నర కాసుల బంగారు గొలుసు లాక్కున్నారు. పక్కనే ఉన్న సుబ్బలక్ష్మి మెడలోని గొలుసును లాగే ప్రయత్నం చేశారు. వారి నుంచి తప్పించుకునే సందర్భంలో ఆమె కిందపడిపోయింది. దీంతో ఆమెను వదిలేసి పరారయ్యారు. అనంతరం వంద మీటర్లు ముందుకెళ్లి బర్ల లలితా అపర్ణాదేవి అనే అంగన్‌వాడీ కార్యకర్త మెడలో ఆరున్నర కాసుల ఆభరణాలను లాక్కెళ్లారు. దొంగలను స్థానికులు వెంబడించినా ఫలితం లేకుండా పోయింది.

మోటారు సైకిల్‌పై వచ్చి..

చోరీకి పాల్పడిన దుండగులు మోటారు సైకిల్‌పై వచ్చారు. వాహనం నడిపే వ్యక్తి హెల్మెట్ ధరించాడు. వెనుక కూర్చున్న దుండగుడు మాస్క్, టోపీ ధరించాడు. చోరీ చేసిన అనంతరం జూనియర్ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు విజయవిహార్ సెంటర్ వైపు వెళ్లిపోయారు. వీరిద్దరే బుధవారం ఉదయం రాజమహేంద్రవరంలోని కోటగుమ్మం సెంటర్ సమీపంలో చోరీకి పాల్పడినట్టు సమాచారం. సీసీ పుటేజ్ ఆధారంగా రెండు చోట్లా చోరీలకు పాల్పడిన నిందితులు ఒక్కరేనని పోలీసులు, అధికారులు నిర్ధారించారు. వీరు ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతానికి చెందిన దొంగలై ఉంటారని భావిస్తున్నారు. కొవ్వూరులో దొంగతనం చేసిన తర్వాత వెళ్లిపోతున్న వీరిని గోకవరం, రంపచోడవరం ప్రాంతాల్లో ఆయా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ దొరకలేదని సమాచారం. కాగా.. ఘటనా స్థలాన్ని పట్టణ సీఐ పి.విశ్వం పరిశీలించారు. రూరల్ సీఐ కె.వి జయబాబు, క్రైం ఎస్సై పి.రవీంద్ర, పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్ రావుతో పాటు ఇతర పోలీసులు బృందాలుగా విడిపోయి నిందితుల కోసం గాలిస్తున్నారు. చోరీలు జరిగిన రోడ్డు వెంబడి ఉన్న సీసీ పుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. బాధితులు పట్టణ పోలీసులను ఆశ్రయించారు.



సీసీ పుటేజ్‌లో నిందితుల విజువల్





బాధితులు నక్కా ధనలక్ష్మి, అపర్ణాదేవి



చోరీ నుంచి తప్పించుకున్న వీర్ల సుబ్బలక్ష్మి

కొంతమూరులో మరో ఘటన

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని ప్రకాశం నగర్ ఎంప్లాయిస్ కాలనీలో బుధవారం మధ్యాహ్నం నడిచి వెళుతున్న మహిళ మెడలోని బంగారు తాడును దొంగలు లాక్కుని పరారయ్యారు. కల్యాణ్ నగర్‌కు చెందిన సాగిరాజు చంద్రావతి నడిచి వెళుతుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు.. ఆమె మెడలోని తొమ్మిది కాసుల విలువైన బంగారు నల్లపూసల తాడు, చైన్ లాక్కుని వెళ్లిపోయారు. అలాగే కుడిపూడి పార్వతి మెడలో బంగారు గొలుసును లాగడానికి ప్రయత్నించినప్పటికీ ఆమె గట్టిగా విదుల్చుకోవడంతో కుదరలేదు. దొంగలు వేగంగా అక్కడ నుంచి పరారయ్యారు. సంఘటన స్థలాన్ని రాజానగరం ఇన్‌స్పెక్టర్ వీరయ్య గౌడ్, ఎస్సైలు, సిబ్బంది పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి

సామర్లకోట: లారీ యజమానుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఉమ్మడి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన బాబ్జీ అన్నారు. స్థానిక లారీ ఓనర్స్ అసోషియేషన్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాజ్జీ బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 26 లారీ ఓనర్ల అసోసియేషన్లు ఉన్నాయన్నారు. ఆయా లారీ ఓనర్స్ అసోసియేషన్ పరిధిలోని ఫ్యాక్టరీలు సొంత లారీలను లోడింగ్‌లకు ఉపయోగించడం వల్ల యూనియన్‌లో ఉన్న లారీ యజమానులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని పరిశ్రమలకు వెళ్లి లారీ ఓనర్స్ అసోసియేషన్లకు సహకరించాలని కోరతామన్నారు. అలాగే ఎమ్మెల్యేలు, డిప్యూటీ సీఎం, సీఎంలకు తమ సమస్యలపై వినతి పత్రాలను అందజేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి నాయుడు మాట్లాడుతూ లారీ ఓనర్స్ సమస్యలను రాష్ట్ర యూనియన్ దృష్టికి తీసుకు వెళ్లతామన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడి దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షుడు రౌతు అర్జుబాబు, సహాయ కార్యదర్శులు వి.సూర్యనారాయణ, కె.పెదకావు, కోశాధికారి ఎంఎస్ఎన్ రాజు, పట్టణ యూనియన్ కార్యదర్శి పెదిరెడ్ల కృష్ణ పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాబ్జీ

ఖననం చేసిన వివాహిత మృతదేహానికి పోస్టుమార్టం

కొత్తపల్లి: ఖననం చేసిన వివాహిత మృతదేహానికి బుధవారం రెవెన్యూ, పోలీసు అధికారుల పర్యవేక్షణలో పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. మూలపేటలోని ప్రకాష్ నగర్‌కు చెందిన గింజాల బాల (25), అదే గ్రామానికి చెందిన రాజపల్లి ప్రసాద్ ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే ఈ నెల 19న బాల మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని భర్త ప్రసాద్, అతని కుటుంబ సభ్యులు ఖననం చేశారు. కాగా.. బాల మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె తల్లి లక్ష్మి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు ఎస్సై వెంకటేష్ కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా మూలపేట శ్మశాన వాటికలో ఖననం చేసిన బాల మృతదేహాన్ని బయటకు తీసి, ఎస్సై వెంకటేష్, తహశీల్దార్ చిన్నారావు పర్యవేక్షణలో ఫోరెన్సిక్ ల్యాబ్ ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు, సభ్యులు పోస్టుమార్టం నిర్వహించారు. సేకరించిన ఆధారాలను విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపనున్నారు.



బాల మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హారన్ కొట్టినందుకు యువకుడిపై దాడి

అమలాపురం టౌన్: దారి ఇవ్వాలని హారన్ కొట్టినందుకు ఒక యువకుడిపై ముగ్గురు దాడి చేశారు. అతడి స్కూటర్‌ను ధ్వంసం చేశారు. ఈదరపల్లి వంతెన సమీపంలో మంగళవారం రాత్రి 11 గంటలకు ఈ ఘటన జరిగింది. వివరాలు.. అమలాపురం రూరల్ మండలం సవరప్పాలేనికి చెందిన కమ్మ సత్తి దుర్గా ప్రసాద్ స్కూటీపై ఈదరపల్లి వంతెన వైపు నుంచి వస్తున్నారు. ఈదరపల్లి గ్రామానికి చెందిన పరమట ఆనందరావు, పరమట సురేష్ (అన్నదమ్ములు), పట్టణంలోని నారాయణపేటకు చెందిన బర్లి వీర వెంకట సత్యనారాయణ అటుగా వెళుతున్నారు. ఈ సమయంలో తన స్కూటీకి వారు అడ్డుగా ఉండడంతో దుర్గా ప్రసాద్ హారన్ కొట్టాడు. దీంతో రెచ్చిపోయిన ఆ ముగ్గురు యువకులు ఇనుపరాడ్డుతో దుర్గా ప్రసాద్ తలపై దాడి చేశారు. ఇది మా ఏరియా, మమ్మల్నే తప్పుకోవాలని హారన్ కొడతావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడి స్కూటీని ట్రాక్టర్‌తో కొంత దూరం ఈడ్చుకుంటూ వెళ్లి ధ్వంసం చేశారు. గాయపడిన దుర్గా ప్రసాద్ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు సీఐ వీరబాబు తెలిపారు.



యువకుల దాడిలో ధ్వంసమైన స్కూటీ

క్రేన్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కొవ్వూరు: దేచెర్ల సమీపంలో క్రేన్ ఢీకొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. క్రేన్ ఆ వ్యక్తి రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ ఎస్సై కె.శ్రీహరి రావు మాట్లాడుతూ ఆ వ్యక్తి రెండు, మూడు రోజులుగా మతిస్థిమితం లేకుండా రోడ్లపై తిరుగుతున్నాడన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94411 70899 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రూ 3.60 లక్షల విలువైన ఎండుగడ్డి దగ్ధం

కరప: పేపకాయలపాలెంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రూ 3.60 లక్షల విలువైన ఎండుగడ్డి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పేపకాయలపాలెం గ్రామానికి చెందిన సలాది శ్రీనుబాబు ఎండుగడ్డి వ్యాపారం చేస్తుంటాడు. గత ఏడాది తొలకరి పంటలో 75 ఎకరాల్లోని ఎండుగడ్డిని కొనుగోలు చేశారు. దాన్ని ఆ గ్రామంలోని సాయిబాబాగుడి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో కట్టలుగా కట్టి నిల్వ చేశాడు. కాకినాడ, పరిసర ప్రాంతాలకు ప్రతి రోజూ ఎండుగడ్డి కట్టలను తీసుకెళ్లి అమ్మకాలు చేస్తుంటాడు. మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో కట్టలుగా పేర్చిన ఎండుగడ్డి వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అటుగా వెళుతున్న కొందరు ఈ విషయాన్ని గుర్తించి, స్థానికులతో పాటు కాకినాడ జగన్నాథపురంలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చేసరికే ఎండుగడ్డి పూర్తిగా కాలిపోయింది. దీనిపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని కరప పోలీసులు తెలిపారు.

ఇంటి నుంచి బయటకు వచ్చే దారేది!

- రహదారిని మూసేసిన పొరుగువారు
- ఇంట్లోనే చిక్కుకుపోయిన వృద్ధురాలు
- మూడు రోజులుగా ఆహారానికి అవస్థలు

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లిలో ఓ వృద్ధురాలు మూడు రోజులుగా గృహ నిర్బంధంలో ఉంది. ఆమె ఇంటి నుంచి బయటకు వచ్చే దారి లేక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. 25 ఏళ్లుగా ఆమె ఉపయోగిస్తున్న దారిని ముందు ఇంటివారు మూసివేశారు. వివరాల్లోకి వెళితే.. అనంతపల్లి పాత పోస్టాఫీసు సమీపంలోని ఓ ఇంట్లో 65 ఏళ్ల మామిడి రూత్ నివసిస్తోంది. ఆమె భర్త జయరాజ్ పాస్టర్‌గా పనిచేస్తూ, పలు గ్రామాల్లో చర్చిలు, విద్యాసంస్థలను నిర్వహించేవారు. ఆయన మృతి చెందాక ఇల్లు నిర్మించుకుని రూత్ జీవిస్తోంది. దాదాపు 25 ఏళ్లుగా తన ఇంటి ముందున్న రోడ్డుపైనే రాకపోకలు సాగించేంది. ఇటీవల ఇంటి ముందున్న వారు ఆ దారిలో నడవడానికి ఆమెకు హక్కు లేదని, రాకపోకలు సాగించవద్దని ఆదేశించారు. ఎవ్వరూ నడవకుండా ముళ్లకంపలు అడ్డుగా వేశారు. దాదాపు నెల రోజుల నుంచి ఈ వివాదం జరుగుతోంది. రూత్‌తో పాటు మరో మూడు కుటుంబాలు ఆ దారినే వినియోగించేవారు. వారికి మరో ప్రత్యామ్నాయ మార్గం దొరికింది. కానీ రూత్ మార్గం మరో దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. బాధితులందరూ ఈ సమస్యపై ఈ నెల 6న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



అనంతపల్లిలో గృహ నిర్బంధంలో ఉన్న మామిడి రూత్

మూడు రోజులుగా అవస్థలు

ఆ దారిని నిలిపివేయడంతో మూడు రోజులుగా రూత్ తీవ్ర ఇబ్బందులు పడుతోంది. పాలు, కూరగాయలు, ఆహారం తెచ్చుకోవడానికి కూడా వీలు లేకుండా పోయింది. ఆమె బంధువులను సైతం అక్కడకు రాకుండా ఎదురింటి వారు అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంతో తనకు ప్రాణహాని ఉందని రూత్.. అధికారులకు విజ్ఞప్తి చేసింది. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్వీకే నాయుడును వివరణ కోరగా.. ఫిర్యాదు పరిష్కారానికి ఆ ప్రాంతానికి వెళ్లామని, ఆ స్థలమంతా గ్రామకంఠం భూమిగా ఉందన్నారు. స్థానికంగానే పరిష్కారం చేసుకోవాలని సూచించారు. ఈ విషయమై కోర్టులో రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఎటువంటి పోలీసు ఫోర్సు వినియోగించవద్దంటూ కోర్టు స్టే ఇచ్చిందన్నారు. వృద్ధురాలి గృహ నిర్బంధం విషయం కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత దృష్టికి బుధవారం మధ్యాహ్నం తీసుకెళ్లగా ఇన్‌చార్జి తహసీల్దార్, గ్రామ కార్యదర్శితో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా బుధవారం సాయంత్రం వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

షోకాజ్ నోటీసులపై వివాదం

- అలసత్వం తగదంటున్న ఎంపీడీవో
- ఆయన తీరు సరికాదంటున్న సిబ్బంది

కాజులూరు: మండలంలోని 23 గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులు, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు తదితర 56 మందికి ఎంపీడీవో షోకాజ్ నోటీసులు జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళితే.. బయోమెట్రిక్ హాజరు తదితర అంశాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల తొమ్మిదో తేదీ మధ్యాహ్నం మండలంలోని 23 గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న వివిధ శాఖల సిబ్బందికి ఎంపీడీఓ జె.రాంబాబు సమావేశం నిర్వహించారు. దీనికి పంచాయతీ కార్యదర్శులు మినహా ఇతర శాఖల సిబ్బంది పూర్తి స్థాయిలో హాజరుకాలేదు. జీఎస్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ ఆదేశాల మేరకు తాను సమావేశం ఏర్పాటు చేశారని, దీనిపై సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండడం విధులకు గైర్హాజరు కావడమేని, దీనిపై 24 గంటలలో సమాధానం ఇవ్వకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని వారికి ఎంపీడీఓ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై వివిధ శాఖల సిబ్బంది మాట్లాడుతూ ఎంపీడీవో తమపై కక్షధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఈశ్వర్రావు, సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రీసర్వే పైలెట్ ప్రాజెక్టు పనుల్లో రెవెన్యూ సిబ్బంది బిజీగా ఉన్నామని, సమావేశం జరిగిన సమయంలో కోలంకలో విధులు నిర్వహిస్తున్నామన్నారు. తాము విధుల్లో ఉన్నప్పటికీ ఎంపీడీఓ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆయన నుంచి తమకు రక్షణ కల్పించాల్సిందిగా ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.



వివిధ శాఖల సిబ్బందికి ఎంపీడీవో జారీ చేసిన షోకాజ్ నోటీసు

పోక్సో కేసులో ఉపాధ్యాయుడికి జైలు

ఉండ్రాజవరం: పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో ఉపాధ్యాయుడికి రెండున్నరేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న డి.గోపాలకృష్ణమూర్తిపై మాగాపు మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై అవినాష్ 2020లో ఫిబ్రవరి 28న కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం సాక్షులను విచారించిన విచారణ అధికారి పోక్సో కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను బట్టి న్యాయమూర్తి ఈ నెల 21న తీర్పును వెలువరించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా డీపీ రామాంజనేయులు వాదించారు.